క్లుప్తంగా

నేటి నుంచి నేషనల్ మెగా లోక్ అదాలత్

హఫీజ్‌పేట్: కూకట్‌పల్లి కోర్టులో ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కేసుల్లో పట్టుబడిన వారు సంబంధిత పత్రాలతో (డ్రైవింగ్ లైసెన్స్, వాహనం ఆర్సీ, ఆధార్‌కార్డు 3 చొప్పున జిరాక్స్ కాపీలు) ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు. వివరాలకు 9490617330, 8712513147, 8712513148, 9550483016, 8712513149లలో సంప్రదించవచ్చు.

జెడ్సీని కలిసిన లైట్‌హౌస్ కమ్యూనిటీస్ సభ్యులు



హఫీజ్‌పేట్: చందానగర్‌లోని లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలపై ఫౌండేషన్ సీఈఓ రుచి మాథుర్, శ్రీనివాస్ ఆకుల బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా నగరంలోని జీహెచ్ఎంసీ సర్కిళ్లకు లైట్‌హౌస్‌ల స్కేలింగ్‌పై కూడా మాట్లాడడం జరిగిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను వృక్షశాస్త్రం(బోటనీ)లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతంతో ఉత్తీర్ణత పొంది ఉండాలని సూచించారు. నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. దరఖాస్తుదారులు అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో సెప్టెంబర్ 2న సాయంత్రం నాలుగు గంటలలోగా కళాశాలలో అందించాలని పేర్కొన్నారు. 4న సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌గా భారతమ్మ ఎన్నిక

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని పీఏసీఎస్ వావిలాల 9వ వార్డు డైరెక్టర్‌గా నీరుడి భారతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల అధికారి చిన్న అందజేశారు. ఈ సందర్భంగా భారతమ్మ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సర్పంచ్ పులిగిల్ల ప్రకాష్‌చారి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌రెడ్డి, వార్డు సభ్యులు ప్రసన్న సత్యనారాయణ చారి, మమత భాస్కర్, సెక్రటరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై జడ్సీకి ఫిర్యాదు



గచ్చిబౌలి డైమండ్‌హిల్స్‌లో శాంతినాథ్ గ్రానైట్స్ ఆక్రమించిన సర్వీస్ రోడ్డు

గచ్చిబౌలి: డైమండ్‌హిల్స్‌లో రోడ్డు ఆక్రమణకు పాల్పడ్డారని డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గచ్చిబౌలి సర్వే నెంబర్ 51లో శాంతినాథ్ గ్రానైట్స్ నిర్వాహకులు పక్కనే ఉన్న 33 అడుగుల రోడ్డును ఆక్రమించారని ఫిర్యాదులో తెలిపారు. ప్రధాన రహదారి వెంట సర్వీస్ రోడ్డుకు అనుసందానంగా ఉన్న పబ్లిక్ రోడ్డును ఆక్రమించి మార్బుల్ ఉంచారు. దీంతో లే అవుట్‌లోకి వెళ్లడానికి వీలు లేకుండా ఉందని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు ఆక్రమణను తొలగించాలని జోన్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నోటీసులు జారీ చేసి ఆక్రమణను తొలగిస్తామని టీపీఎస్ రమేష్ తెలిపారు.

ఇంటికో ఇన్‌చార్జిగా పనిచేస్తాం

పటాన్‌చెరు టౌన్: నీలం మధుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ఒక్క అవకాశం ఇవ్వాలని, ఇందుకు ఇంటికో ఇన్‌చార్జి ఉండి గెలిపించుకుంటామంటూ ముదిరాజ్ సంఘాల నాయకులు, ప్రజలు, యువత కోరుతున్నారు. బుధవారం వారు మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో రాష్ట్రంలో కీలకమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక్క సీటు కేటాయించకుండా కేసీఆర్ నిర్లక్ష్యం చెయ్యడంపై బీసీలు గొంతెత్తుతున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నిత్యం ప్రజాసేవ చేయడంతోపాటు బీయార్ఎస్ పార్టీ కోసం కష్టపడుతున్న నీలం మధు ముదిరాజ్‌కు టికెట్ కేటాయించకపోవడం సరికాదన్నారు.

నిర్మించారు.. వదిలేశారు..



చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద నిర్మించిన వీధి వ్యాపారులు సముదాయం



చందానగర్ మంజీరా రోడ్డుపై ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు

- నిరుపయోగంగా వీధి వ్యాపారుల సముదాయం
- వీధి వ్యాపారుల తరలింపులో అధికారుల నిర్లక్ష్యం
- తప్పని ట్రాఫిక్ తిప్పలు

హఫీజ్‌పేట్: చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద లక్షల రూపాయాలతో నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయం నిరుపయోగంగా మారింది. జీహెచ్ఎంసీ అధికారులు హడావుడిగా స్ట్రీట్ వెండర్స్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించి రూ.90 లక్షల నిధులతో సముదాయం నిర్మించి, పండ్లు, కూరగాయాల బొమ్మల గీయించి, నెంబర్లు రాశారు. కానీ ఇప్పుడు దానిని పట్టించుకునే వారే కరువయ్యారు. రోడ్లపై వీధి వ్యాపారులు మంజీరా రోడ్డు ఇరువైపుల ఇష్టానుసారంగా పండ్లు, కూరగాయాల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనదారులకు తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీధి వ్యాపారులకు సముదాయంలో దుకాణాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

- చందానగర్ బీఆర్ గ్యాస్ కంపెనీ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న మంజీరా రోడ్డులో ఇరువైపుల పండ్లు, కూరగాయల దుకాణాల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది.
- జీహెచ్ఎంసీ అధికారులు చిరు వ్యాపారులకు సముదాయాలలో దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.
- సముదాయాలలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పెరిగి, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్న వారిపై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలి.
- రోడ్డుపై భిక్షాటన చేసే వారికి వీధి వ్యాపారులు సముదాయం అడ్డగా మారింది.
- అధికారులు పక్క ప్రణాళికలు లేకుండా, అనువైన స్థలాన్ని నిర్మించారని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.
- వారాంతపు సంతలతో వీధి వ్యాపారుల సముదాయాలకు వ్యాపారులు రావడానికి ఆలోచిస్తున్నారు.
- హుడా కాలనీలో ఐదేళ్ల క్రితం నిర్మించిన మోడల్ మార్కెట్‌లో వీధి వ్యాపారులకు కేటాయించకపోవడంతో అవి కూడా నిరుపయోగంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులు కలిసి రోడ్డుపై ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తరలింపు చేయాలి.

అధికారులదే నిర్లక్ష్యం..



చందానగర్ రైలేస్టేషన్ వద్ద నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయంలో దుకాణాలు కేటాయించడంలో జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం ఉంది. ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు రోడ్డుపై ఏర్పాటు చేస్తున్న స్ట్రీట్ వెండర్లను సముదాయాలకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– అనంత్, పాపిరెడ్డి కాలనీ

తాగుబోతులకు అడ్డాగా..

వీధి వ్యాపారుల సముదాయం నిర్మాణం పూర్తి అయ్యి నెలలు గడుస్తున్నా ఒక దుకాణాం కూడా వ్యాపారులకు కేటాయించకపోవడం బాధాకరం. రాత్రి అయితే చాలు సముదాయంలో తాగుబోతులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో వీధి వ్యాపారులు సముదాయం వైపు పెట్రోలింగ్ చేయాలి.

– శంకర్, హుడాకాలనీ

'మూడోసారి అధికారం బీఆర్ఎస్ పార్టీదే'



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ముచ్చటగా మూడోసారి అధికారం బీఆర్ఎస్ పార్టీదేనని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. తారానగర్‌కు చెందిన 100 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, సీనియర్ నాయకుడు రాంచంద్రం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత అంతా బీఆర్ఎస్ వైపే ఉందని, యువత బీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనుల పట్ల ప్రజలంతా ఆకర్షితులవుతున్నారన్నారు. శేరిలింగంపల్లిలో 9 ఏళ్లల్లో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామని, మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హరీష్‌రావు, చంద్రకాంత్‌రావు, ప్రసాద్, కాశీనాథ్, కోనేరు ప్రసాద్, వెంకట్‌నాయక్, శ్రీనివాస్, రవికుమార్, జ్ఞానేశ్వర్, రఘు పాల్గొన్నారు.

గడపగడపకూ రవన్న ప్రజాయాత్ర



సంక్షేమ పథకాలను వివరిస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్: భవానీపురం కాలనీ అభివృద్ధికి ఆడమ దూరంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని భవానీపురం కాలనీలలో బీజేపీ గడపగడపకూ రవన్న ప్రజాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి దశాబ్ద కాలంగడుస్తున్నా కాలనీలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఎమ్మెల్యేకు కావాల్సిన కాలనీలను అభివృద్ధి చేశాడే తప్పా ప్రజలకు అవసరమైన కాలనీలకు మాత్రం ఎలాంటి అభివృద్ధి చేయలేదని కాలనీవాసులకు తెలుసన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించాలన్నారు. ఈ ప్రజాయాత్రలో మాజీ కార్పొరేటర్ నవతరెడ్డి, నాయకులు గంగాధర్‌రెడ్డి, లక్ష్మికాంత్ రెడ్డి, చందర్ యాదవ్,రంగయ్య, అనంతరెడ్డి, మల్లేష్ గౌడ్, కృష్ణ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ వేడుకలు

రాయదుర్గం: రాఖీ వేడుకలను గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను జరిపారు. 9వ నిజామ్ రౌనక్‌యార్‌ఖాన్‌ను సోదరుడిగా భావించి బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి తమ సోదరభావాన్ని చాటారు. ఈ సందర్భంగా రౌనక్‌యార్‌ఖాన్ మాట్లాడుతూ.. ప్రశాంతతకు మారుపేరుగా పేర్కొనే ప్రాంతం శాంతిసరోవర్ అన్నారు. పవిత్రమైన రాఖీ వేడుకల్లో పాల్గొనడం బ్రహ్మకుమారీల చేత సోదరుడిగా రాఖీలు కట్టుకోవడం ఆనందంగా ఉందన్నారు. శాంతిసరోవర్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్‌దీదీ మాట్లాడుతూ.. బ్రహ్మకుమారీల సంస్థ అనేది ఆధ్యాత్మిక ఆధారితమైన వ్యక్తులతో కూడిన అంతర్జాతీయ సంస్థ అని పేర్కొన్నారు.



శాంతిసరోవర్‌లో 9వ నిజాం రౌనక్‌యార్‌ఖాన్‌కు రాఖీ కడుతున్న కుల్‌దీప్‌దీదీ

కృష్ణవేణి హైస్కూల్‌లో ..

గచ్చిబౌలి: శ్రీరామ్‌నగర్‌లోని కృష్ణవేణి హైస్కూల్‌లో రాఖీ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యార్థినులచే రాఖీలను కట్టించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాఖీ పౌర్ణమి ప్రాధాన్యతను వివరించారు. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముడి మధ్య ఉండే ప్రేమానుబంధాల కలకలం ఉంటాయని వారి ప్రాధాన్యతను వివరించారు.



శ్రీరామ్‌నగర్‌లోని కృష్ణవేణి హైస్కూల్‌లో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



కొంగరకలాన్‌లో జరిగిన సమావేశంలో మంత్రి సబితారెడ్డితో పాల్గొన్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యేగాంధీ

గచ్చిబౌలి: పేదల సొంతింటికల నెరవేర్చడమే డబుల్ బెడ్‌రూమ్‌ల లక్ష్యమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో మొదటి విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, నాయకులు, జిల్లా కలెక్టర్ హరీష్ పాల్గొన్న కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతలో నియోజకవర్గానికి 500 చొప్పున కేటాయించారని గుర్తుచేశారు. శేరిలింగంపల్లిలోని 500 మంది లబ్ధిదారులకు పారదర్శకంగా కేటాయించడం జరుగుతుందన్నారు. శేరిలింగంపల్లిలో 2,910 దరఖాస్తులను పరిశీలించి అందులో మొదటి విడతలో 500 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా స్థలం ఉన్న వారికి గృహలక్ష్మి కింద రూ.3 లక్షలను అందించి ఇల్లు నిర్మించుకునేందుకు సహాయం చేయడం జరుగుతుందని ఆయన గుర్తుచేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మోడ్రన్ హైదరాబాద్, ఎమోషన్స్ ఆఫ్ హైదరాబాద్ థీమ్‌లతో ఫొటో పోటీలను నిర్వహించారు. ఈ ఫొటోలలో విజేతలుగా హర్షవర్ధన్, శ్రవణ్ నిలిచారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ, కానిస్ట్యూంట్ అసోసియేషన్ తెలంగాణ ఈవెంట్ ఫెసిలిటెటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్లు ఔత్సాహికుల కోసం మాస్టర్ క్లాసులను నిర్వహించారు. జర్నీ ఆఫ్ ఫొటోగ్రఫీపై రవీందర్‌రెడ్డి, స్టూడియో ఫొటోగ్రఫీపై రవినల్లి, డైయింగ్ ఫొటోగ్రఫీపై ఫోట్రియా వెంకీ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 50 మంది ఫొటోగ్రాఫర్లు వివిధ థీమ్‌లతో ఫొటోలు ప్రదర్శించారు. రవివర్మ, సంజయ్ రాయచూర, ఎంఎస్ రాధా వారణాసి, అజిత్‌నాగ్‌లతో కూడిన జ్యూరీ విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో టీసీఈఐ అధ్యక్షుడు బలరాం బాబు, జనరల్ సెక్రటరీ రవి బురా, టీఈఎఫ్ఏ అధ్యక్షుడు మనోజ్ ఇనాని, కో కన్వీనర్, సెక్రటరీ సందీప్‌జైన్, కో కన్వీనర్ కుమార్ రాజా పాల్గొన్నారు.



అవార్డును అందుకున్న లెన్నీ ఇమ్మాన్యుయేల్

జూదరుల అరెస్ట్

మియాపూర్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పరిధిలోని హాఫీస్‌పేట్ అంబేద్కర్‌నగర్ కాలనీలో ఓ గుడిసెలో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు మియాపూర్ పోలీసులు తనిఖీ చేశారు. మాణిక్యం, వెంకటేష్ , శ్రీనివాస్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, మహమ్మద్ ముసియుద్దీన్ అందరూ కలిసి పేకాట ఆడుతున్నారు. వారిని మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తల్లిదండ్రులను చంపిన కుమారుడికి జీవిత ఖైదు

హఫీజ్‌పేట్: తల్లిదండ్రులను చంపిన కేసులో కుమారుడికి కూకట్‌పల్లి కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.3వేల జరిమానా లేకపోతే అదనంగా 3 నెలలు శిక్ష తీర్పును బుధవారం ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. 2014లో వికారాబాద్ జిల్లా పుల్సుమామిడి గ్రామానికి చెందిన సాదిక్ మియా, ఆషాబీ భార్యాభర్తలిద్దరు శేరిలింగంపల్లి గోపీనగర్‌లో అద్దె ఇల్లు తీసుకొని జీవిస్తున్నారు. జూన్ 29 రాత్రి 9.30 గంటలకు సాదిక్ మియా, ఆషాబీల కుమారుడు రషీద్ పాషా (33) చున్నితో ఉరివేసి చంపాడు. చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్ తరలించారు. 9 ఏళ్ల తర్వాత కూకట్‌పల్లి 6వ కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించింది.

యాచకుడి మృతి

హఫీజ్‌పేట్: గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ నెంబర్ ప్లాట్ ఫారం వైపు ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని యాచకుడు (65) మృతి చెందాడని స్థానికులు చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు టికెట్లు కేటాయించాలి

పటాన్‌చెరు టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసేందుకు ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ పార్టీ కనీసం నాలుగు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించేలా చొరవ తీసుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ని నీలం మధు ముదిరాజ్ కోరారు. ప్రగతి భవన్‌లో మంత్రి హరీశ్‌రావుతో సీట్ల కేటాయింపుపై చర్చించేందుకు ఆయనతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. కేటాయించిన సీట్లలో పటాన్‌చెరు నుంచి నీలం మధు ముదిరాజ్ కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని బండ ప్రకాశ్ కోరారు. అలాగే రాష్ట్రంలో మత్స్యశాఖ ఫెడరేషన్, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ముదిరాజులంతా ఒక తాటిపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని త్వరలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారని నీలం మధు ముదిరాజ్ తెలిపారు. ముదిరాజ్‌లకు న్యాయం జరిగే వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు చెప్పారు.

గీతంలో ఘనంగా ఓనం

పటాన్‌చెరు టౌన్: కేరళలో వైభవంగా జరుపుకునే ఓనం పండుగను రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. 'సింఫనీ ఆఫ్ హార్మోని' (భిన్న సమూహాల సామరస్యం) ఇతివృత్తంగా ఈఏడాది ఓనంను నిర్వహిస్తున్న విషయం విదితమే. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించారు. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఓనం జరుపుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు శోభాయమానంగా నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్‌ని అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, మెడ్వాన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించే వారిని ప్రోత్సహిస్తాం



విజేతలకు మెడల్స్ అందించి వారితో వీసీ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్ పలువురు ప్రొఫెసర్లు

రాయదుర్గం: చదువుతోపాటు క్రీడల్లో రాణించేవారిని ప్రోత్సహిస్తామని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన పలు రకాల పోటీల్లో విజేతలకు ఆయన మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్యంగా 'స్పోర్ట్స్ ఈజ్ ఎనేబులర్ ఇన్‌క్లూజివ్, ఫిట్ సొసైటీ'అనే థీమ్‌తో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టరేట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ (డీపీఈఅండ్ ఎస్) ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చదువుకునే సమయంలో క్రీడలపట్ల ఆసక్తి కలిగి ఉంటే భవిష్యత్తులో ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్లు మహ్మద్ అబ్దుల్ అజీమ్, డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్,డాక్టర్ ఏ కలీముల్లా పాల్గొన్నారు.

రూ.10 లక్షల డ్రగ్స్ పట్టివేత

పోలీసుల స్పెషల్ ఆపరేషన్



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ నరసింహారావు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత మందులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిషేధిత టాబ్లెట్లు, ఇంజక్షన్లు (డ్రగ్స్) విక్రయించే ముఠాను కొల్లూరు పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు, యాంటీ డ్రగ్స్ కార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి అరెస్టు చేశారు. ఈ సంఘటన బుధవారం కొల్లూరులో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు మియాపూర్ ఏసీపీ నరసింహారావు వెల్లడించారు. అహ్మద్ బిన్ అబ్దుల్ ఖాదర్ నగరంలోని చాంద్రాయణగుట్టలో జిమ్ నిర్వహిస్తుంటాడు. ఇందులో సరైన ఆదాయం లేకపోవడంతో మహ్మద్ ఇబ్రహీంతో కలిసి శరీర దృఢత్వాన్ని పెంచే నిషేధిత డ్రగ్స్ విక్రయించడం మొదలుపెట్టారు. వీరు కొల్లూరు ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. శరీర దృఢత్వం పెరిగే టాబ్లెట్స్ కావాలంటూ వారి వద్దకు మఫ్టీలో వెళ్లారు. వాటిని కొనుగోలు చేస్తామని మభ్యపెట్టి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో అహ్మద్ బిన్ అబ్దుల్ ఖాదర్, మహ్మద్ ఇబ్రహీంలను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా జిమ్‌లో ఉన్న నిషేధిత డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. శరీర దృఢత్వం పెంపొందించే డ్రగ్స్ సీసాను రూ.300కు కొనుగోలు చేసి వాటిని రూ.వెయ్యి నుంచి రూ.1400కు అమ్ముతున్నారు. వీటిలో పశువులకు వాడే టాబ్లెట్లు, ఇంజక్షన్లు ఉండటం విశేషం. వీటిని ఉపయోగిస్తే త్వరగా అనారోగ్యానికి గురవడంతోపాటు గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుంది. వీటిని నిందితులకు నగరంలోని గాజుల దుకాణదారుడు, మీసేవ నిర్వాహకుడు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. త్వరలోనే డ్రగ్స్ సరఫరా చేసేవారిని పట్టుకుంటామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజమౌళి, కొల్లూరు సీఐ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.